అర్హులైన రైతులకు రుణమాఫీ

- ఖమ్మం కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్
- వీవీపాలెం సాసైటీ కార్యాలయం తనిఖీ

రఘునాథపాలెం, జూలై 25 : ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులైన రైతులందరికీ రుణ మాఫీ ఫలాలు అందేలా చర్యలు తీసుకోవాలని, రుణాల రెన్యూవల్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఖమ్మం కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ అధికారులను ఆదేశించారు. గురువారం వీ వెంకటాయపాలెం పీఏసీఎస్‌ను ఆయన తనిఖీ చేశారు. రైతుల రుణాల రెన్యూవల్ ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్.. రుణమాఫీ రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఏసీఎస్ పూలింగ్ ఖాతాకు చేరిన మొత్తం నగదును సంబంధిత రైతుల ఖాతాకు చేరేలా చర్యలు చేపట్టాలన్నారు. 2018 కటాఫ్‌గా, 2023 వరకు అవుట్ స్టాండింగ్ లోన్లను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. విస్తరణాధికారులు గ్రామాల్లో పర్యటించి రైతులతో ఇంటరాక్ట్ కావాలని, ఎంతమందికి మొదటి విడతలో రుణమాఫీ అయింది? ఎంతమంది తీసుకున్నారు? అనే వివరాలు తెలుసుకోవాలన్నారు. జిల్లాలో 57,857 మందికి మొదటి విడతలో రుణమాఫీ కాగా.. ఇప్పటివరకు 51,000 మంది రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అయినట్లు చెప్పారు. మిగిలిన వారికి వివిధ కారణాలతో జమ కాలేదని, వాటిని సరిచేసి ఖాతాల్లో జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి విజయనిర్మల, ఎల్‌డీఎం శ్రీనివాసరెడ్డి, ఏడీఏ శ్రీనివాసరావు, ఏవో ఇంటూరి భాస్కర్ రావు, డీసీసీబీ బ్యాంక్ మేనేజర్ తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

మావోయిస్టుల కోసం గాలింపు చర్యలు: ఎస్పీ

కొత్తగూడెం క్రైం/గుండాల, జూలై 25 : గుండాల మండలం దామరతోగు అటవీ ప్రాంతంలో ఎదురుకాల్పుల ఘటనలో తప్పించుకున్న మావోయిస్టుల కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు ఎస్పీ రోహిత్‌రాజు తెలిపారు. కొత్తగూడెంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ ఎదురుకాల్పుల ప్రాంతంలో అలీవ్ గ్రీన్ దుస్తులు ధరించిన ఒక యువకుడి మృతదేహంతోపాటు 303, ఎస్ఎల్ఆర్ ఆయుధాలు, మందుగుండు సామగ్రి, విప్లవ సాహిత్యం తదితర వస్తువులు లభించినట్లు తెలిపారు. మావోయిస్టు పార్టీకి చెందిన భద్రు, లచ్చన్నతోపాటు దాదాపు 15 మంది సభ్యులు ఆయుధాలతో దామరతోగు గుండాల, కరకగూడెం, తాడ్వాయి అటవీ ప్రాంతంలో సంచరిస్తూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతూ.. పలువురిని బెదిరిస్తూ వసూళ్లకు పాల్పడుతుండడంతో వారిని పట్టుకునేందుకు కూంబింగ్ చేపట్టామన్నారు. ఈ క్రమంలో కూంబింగ్ చేస్తున్న బలగాలపై మావోయిస్టులు కాల్పులు జరిపారని, పోలీసులు లొంగిపోవాలని చెప్పినా వినలేదన్నారు. దీంతో పోలీసులు సైతం కాల్పులకు దిగారని, కాల్పుల విరమణ తర్వాత ఆ ప్రాంతంలో ఒక మృతదేహం లభ్యమైనట్లు వివరించారు. తప్పించుకున్న మావోయిస్టుల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశామని పేర్కొన్నారు.

ఎదురుకాల్పుల్లో మావోయిస్టు హతం

భద్రాద్రి-ములుగు జిల్లాల సరిహద్దుల్లో ఘటన

గుండాల, జూలై 25 : స్పెషల్ పార్టీ పోలీసులు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ఓ మావోయిస్టు హతమయ్యాడు. ఈ ఘటన భద్రాద్రి కొత్తగూడెం-ములుగు జిల్లా సరిహద్దు గుండాల మండలం దామరతోగు అడవుల్లో గురువారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గుండాల మండలం దామరతోగు అడవుల్లో దాదాపు పది పదిహేను మంది మావోయిస్టులు సంచరిస్తున్నారనే సమాచారం అందుకున్న స్పెషల్ పార్టీ పోలీసులు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సెర్చింగ్ ఆపరేషన్ చేపట్టారు. ఈ క్రమంలో స్పెషల్ పార్టీ పోలీసులను గమనించిన మావోయిస్టులు కాల్పులు ప్రారంభించారు. వెంటనే అప్రమత్తమైన స్పెషల్ పార్టీ పోలీసులు కాల్పులకు దిగారు. దీంతో ఒక మావోయిస్టు మృతిచెందినట్లు సమాచారం. మావోయిస్టు దళ సభ్యుడు అశోక్ అని తెలుస్తోంది. అయితే కాల్పులు జరిగిన ప్రాంతంలో ఎంత మంది మావోయిస్టులు ఉన్నారనేది తెలియాల్సి ఉంది. పూ

ఉలిక్కిపడ్డ ఏజెన్సీ

తుపాకుల మోతతో ఏజెన్సీ ప్రాంతం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఇంతకాలం తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల్లో ఎన్‌కౌంటర్లు జరగ్గా.. తెలంగాణ రాష్ట్రంలో చాల కాలం తర్వాత ఎన్‌కౌంటర్ జరగడంతో ఏజెన్సీ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. దామరతోగు అటవీ ప్రాంతంలో మావోయిస్టులు, స్పెషల్ పార్టీ పోలీసుల మధ్య ఎదురు కాల్పులు జరగడంతో గుండాల, పినపాక, మణుగూరుతోపాటు ములుగు జిల్లా తాడ్వాయి, మంగపేట, ఏటూరునాగారం పోలీసులు అప్రమత్తమయ్యారు. ఎన్‌కౌంటర్‌తో ఇంతకాలం స్తబ్దుగా ఉన్న ఏజెన్సీ ప్రజలు బిక్కుబిక్కుమంటున్నారు. ఎటు నుంచి ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని దిగులు చెందుతున్నారు.

- న్యాయవాది నుంచి రూ.20 వేలు లంచం తీసుకుంటుండగా పట్టుకున్న అధికారులు
- కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలింపు

ఏసీబీకి చిక్కిన పాల్వంచ పట్టణ ఎస్సై

లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడిన ఎస్సై రాము

పాల్వంచ, జూలై 25 : ఓ కేసు విషయంలో ఓ ఎస్సై న్యాయవాది నుంచి రూ.20 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు వలపన్ని పట్టుకున్నారు. ఈ ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పట్టణంలో గురువారం చోటు చేసుకుంది. ఏసీబీ డీఎస్పీ వై.రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. పాల్వంచకు చెందిన సీరపు శ్రావణి అనే మహిళ కొత్తగూడెంకు చెందిన బాల సాని గణేశ్ గౌడ్‌కు రూ.20 వేలు అప్పుగా ఇచ్చింది. ఈ క్రమంలో అతడు మరణించగా.. అప్పు డబ్బుల కోసం అతడి కుటుంబ సభ్యులపై కొత్తగూడెం కోర్టులో శ్రావణి కేసు వేసింది. అయితే గణేశ్ గౌడ్‌కు చెందిన ఆస్తిని పాల్వంచకు చెందిన చావా శ్రీనివాస్ అనే వ్యక్తి కోర్టులో కేసు ఉండగానే కొనుగోలు చేశాడు. దీనిపై బాధితురాలు శ్రావణి తరపున హైకోర్టు న్యాయవాదిగా పనిచేస్తున్న పాల్వంచకు చెందిన లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో చావా శ్రీనివాస్‌తో సంప్రదింపులు జరపగా.. ఆ డబ్బులు తానే ఇస్తానని ఒప్పుకొని తర్వాత వేధింపులకు గురి చేశాడు. దీంతో ఆమె పాల్వంచ పట్టణ పోలీస్ స్టేషన్‌లో 2024, మే 19న పట్టణ ఎస్సై బాణాల రాముకు ఫిర్యాదు చేసింది. ఫిర్యాదుపై ఎస్సై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ఆమె ఎస్పీకి ఫిర్యాదు చేసింది. మళ్లీ కొత్తగూడెం కోర్టులో ఈ నెల 3న ప్రైవేట్ కేసు దాఖలు చేయగా.. సదరు వ్యక్తులపై ఎట్టకేలకు కేసు నమోదు చేశారు. కేసు విషయంలో చార్జిషీట్ దాఖలు చేయడానికి కోర్టుకు ఎఫ్ఐఆర్ కాపీ కావాలని సదరు న్యాయవాది ఎస్సైని సంప్రదించగా.. తనకు డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ముందుగా తనకు రూ.20 వేలు ఇవ్వాలని చెప్పడంతో న్యాయవాది లక్ష్మారెడ్డి హైదరాబాద్‌లో ఏసీబీ అధికారులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. దీంతో వారు ఖమ్మం ఏసీబీ డీఎస్పీ వై.రమేశ్‌కు సమాచారం అందించారు. గురువారం మధ్యాహ్నం సమయంలో పాల్వంచలోని తన ఇంటికి వచ్చి డబ్బులు ఇవ్వాలని ఎస్సై రాము న్యాయవాదిని కోరారు. దీంతో సదరు బాధిత మహిళ శ్రావణి తరపు న్యాయవాది లక్ష్మారెడ్డి నుంచి ఎస్సై రాము రూ.20 వేలు లంచం తీసుకుంటుండగా అప్పటికే మాటు వేసిన ఏసీబీ అధికారులు డీఎస్పీ వై.రమేశ్ ఆధ్వర్యంలో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

ఐదుగురు హార్డ్‌కోర్ మావోయిస్టుల లొంగుబాటు

లొంగిపోయిన మావోయిస్టుల వివరాలు వెల్లడిస్తున్న పోలీస్ అధికారులు

కొత్తగూడెం క్రైం, జూలై 25 : ఐదుగురు హార్డ్ కోర్ మావోయిస్టులు ఛత్తీస్‌గఢ్ పోలీసుల ఎదుట గురువారం లొంగిపోయారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఏఎస్పీ నిఖిల్ రాఖేచ వెల్లడించారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన మావోయిస్టులు ఎస్పీ కిరణ్ చవాన్ ఎదుట లొంగిపోయినట్లు ఆయన వెల్లడించారు. వారిలో ముగ్గురు మహిళా మావోయిస్టులు ఉన్నట్లు పేర్కొన్నారు. వీరిలో ముగ్గురు మావోయిస్టులపై ఒక్కొక్కరిపై రూ.5 లక్షల రివార్డు ఉందని, మరో ఇద్దరిపై రూ.4 లక్షల రివార్డు ఉందని వెల్లడించారు.

మావోయిస్టుల కుట్ర భగ్నం

ఛత్తీస్‌గఢ్ ఏజెన్సీ ప్రాంతంలో మావోయిస్టుల కుట్రను భద్రతా దళాలు భగ్నం చేశాయి. సుక్మా జిల్లా భెజ్జి-కొత్తచెరు మధ్య నిర్మించిన వంతెన కింద మావోయిస్టులు సొరంగం తవ్వి మందుపాతరను అమర్చారు. భద్రతా దళాలే లక్ష్యంగా అమర్చిన మందుపాతరను ఆ ప్రాంతంలో సెర్చింగ్ ఆపరేషన్స్ నిర్వహించిన సీఆర్‌పీఎఫ్ 219వ బెటాలియన్ జవాన్లు గుర్తించి నిర్వీర్యం చేశారు.

దామరతోగు ఎన్‌కౌంటర్‌పై సీఎం బాధ్యత వహించాలి

మావోయిస్టు పార్టీతో విడుదలైన లేఖ

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల మండలం దామరతోగు అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌కు ముఖ్యమంత్రి, ఎమ్మెల్యేలే బాధ్యత వహించాలంటూ మావోయిస్టు పార్టీ భద్రాద్రి కొత్తగూడెం-అల్లూరి సీతారామరాజు డివిజన్ కమిటీ కార్యదర్శి ఆజాద్ పేరుతో గురువారం లేఖ విడుదలైంది. రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షిస్తానని వాగ్దానం చేసి అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి కేంద్రంతో కుమ్మక్కై మావోయిస్టు పార్టీ నిర్మూలనకు కగార్ దాడిని తీవ్రతరం చేశారని ఆరోపించారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన 8 నెలల కాలంలో పోలీసులతో నిరంతరం అడవులను జల్లెడపట్టిస్తూ.. బూటకపు ఎన్‌కౌంటర్లు, ఎన్‌కౌంటర్లు చేస్తూ ప్రజల కోసం పని చేస్తున్న విప్లవకారులను హత్య చేస్తున్నారని పేర్కొన్నారు. దామరతోగు ఎన్‌కౌంటర్‌ను మావోయిస్టు పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని, రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

జెండాపాట ధర పెరిగింది

- ఏసీ మిర్చి క్వింటా గరిష్ట ధర క్వింటా రూ.19,400
- 'నమస్తే' కథనానికి స్పందన.. ఏఎంసీలో చర్చ..

ఖమ్మం వ్యవసాయం, జూలై 25 : ఖమ్మం వ్యవసాయ మార్కెట్లో ఏసీ రకం మిర్చి పంట ధర ఎట్టకేలకు పెరిగింది. గడిచిన పక్షం రోజుల నుంచి మిర్చియార్డులో జరుగుతున్న జెండాపాటలో గరిష్ట ధర క్వింటా రూ.19,300 వద్ద కొనసాగుతున్న విషయం విదితమే. దాదాపు పక్షం రోజులుగా ఒక రూపాయి కూడా పెరగకుండా, ఒక రూపాయి కూడా తగ్గకుండా ఖరీదుదారులు వారు అనుకున్న ధరకు మాత్రమే జెండాపాటను ముగిస్తున్నారు. దీంతో మార్కెట్ చరిత్రలోనే ఇలా జరగడం తొలిసారి అయింది. ఇదే విషయాన్ని ప్రస్తావిస్తూ 'పెరగట్లేదు.. తగ్గట్లేదు..' శీర్షికన 'నమస్తే తెలంగాణ' గురువారం ఓ కథనాన్ని ప్రచురించిన విషయం విదితమే. దీంతో ఈ కథనం మార్కెట్ వర్గాల్లో చర్చనీయాంశమైంది. తమ ఆందోళనను ప్రస్ఫుటిస్తూ కథనం ప్రచురితం కావడం పట్ల గ్రామాల్లోని రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఎట్టకేలకు గురువారం ఉదయం జరిగిన జెండాపాటలో ఏసీ మిర్చి ధర క్వింటాకు రూ.100 పెరిగి రూ.19,400కు చేరింది. కాగా, గురువారం నాడు మిర్చియార్డుకు ఏసీ పంటకు చెందిన 2,120 బస్తాలను రైతులు విక్రయానికి తెచ్చారు. గరిష్ట ధర క్వింటాకు రూ.19,400 పలికింది. మధ్య ధర రూ.15,300, కనిష్ట ధర రూ.10 వేల చొప్పున నిర్ణయించి వ్యాపారులు పంటను కొనుగోలు చేశారు. కాగా, సాధారణ రకం పంటకు క్వింటాకు గరిష్ట ధర రూ.17,700 పలికింది.

పూర్తయిన ఎస్ఏల సర్దుబాటు

- జిల్లాలో 51 మందికి స్థానచలనం
- డీఈవో తీరుపై మండిపడుతున్న ఉపాధ్యాయ సంఘాలు

ఖమ్మం ఎడ్యుకేషన్, జూలై 25 : జిల్లాలో ఉపాధ్యాయులు లేక విద్యాబోధన కుంటు పడుతున్న పాఠశాలలకు మిగులు టీచర్ల సర్దుబాటు ప్రక్రియను విద్యాశాఖ పూర్తి చేసింది. ఏయే ఉన్నత పాఠశాలల్లో ఎందరు ఉపాధ్యాయులు ఎక్కువగా ఉన్నారో గుర్తించి.. వారిని సమీప పాఠశాలలకు సర్దుబాటు చేయాలి. కానీ.. దీనికి విరుద్ధంగా ఎంఈవోల నుంచి నివేదికలు తీసుకుని అదే మండలంలో కాకుండా ఇతర మండలాల్లోని పాఠశాలల్లో ఉపాధ్యాయులను నియమించారు. జిల్లావ్యాప్తంగా 230 ఉన్నత పాఠశాలలు ఉండగా.. 35కిపైగా స్కూళ్లలో మిగులు టీచర్లు ఉన్నట్లు గుర్తించారు. అందులో 51 మందిని స్కూల్ అసిస్టెంట్ల కొరత ఉన్న ఇతర పాఠశాలలకు సర్దుబాటు చేస్తూ డీఈవో సోమశేఖర శర్మ గురువారం ఉత్తర్వులు విడుదల చేశారు. అత్యధికంగా వేంసూరు, ఎర్రుపాలెం మండలాల్లో టీచర్ల కొరత ఎక్కువగా ఉన్నట్లు గుర్తించారు. సీనియర్ ఉపాధ్యాయులను కాక కొన్నిచోట్ల జూనియర్ టీచర్లను సర్దుబాటు చేసినట్లు తెలుస్తోంది. అనధికారికంగా బోధన పేరుతో టీచర్లను సర్దుబాటు చేసిన డీఈవో తీరుపై ఉపాధ్యాయ సంఘాలు మండిపడుతున్నాయి. ప్రస్తుతం పని చేస్తున్న ప్రదేశం కంటే ఎక్కువ దూరంలో ఉన్న పాఠశాలలకు కేటాయిస్తే ఎలా వెళ్లాలని పలువురు ఉపాధ్యాయులు ప్రశ్నిస్తున్నారు. సర్దుబాటు విషయంపై తమతో చర్చించకుండా ఏకపక్షంగా నిర్ణయాలు ఎలా తీసుకుంటారని కొన్ని సంఘాల నేతలు గుర్రుగా ఉన్నారు. గురువారం ప్రస్తుతం ఉన్న పాఠశాలల్లో రిలీవ్ అయి వెంటనే కేటాయించిన స్థానాల్లో చేరాలని, లేదంటే చర్యలు తీసుకుంటామని ఉత్తర్వుల్లో డీఈవో పేర్కొన్నారు.

తాలిపేరు 13 గేట్ల నుంచి నీరు విడుదల

చర్ల, జూలై 25 : తాలిపేరు ప్రాజెక్టు 13 గేట్లు పూర్తిగా ఎత్తి 15,696 క్యూసెక్కుల నీటిని అధికారులు దిగువనున్న గోదావరిలోకి వదిలారు. ప్రాజెక్టు నీటి సామర్థ్యం 74 మీటర్లు ఉండగా.. ప్రస్తుతం 70.40 మీటర్లు ఉంది. ఎగువ ప్రాంతం నుంచి స్వల్పంగా వరద నీరు వస్తుండడంతో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

కుక్కను తప్పించబోయి అదుపుతప్పిన బైక్

ద్విచక్ర వాహనదారుడు మృతి

దమ్మపేట, జూలై 25 : కుక్కను తప్పించబోయి అదుపుతప్పి కిందపడడంతో ఓ ద్విచక్ర వాహనదారుడు మృతిచెందిన ఘటన మండలంలోని గణేశ్‌పాడు క్రాస్ రోడ్డు వద్ద బుధవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. పెనుబల్లి మండలం ఏరుగట్ల గ్రామానికి చెందిన తాటి శ్రీనివాసరావు(40) తన ద్విచక్ర వాహనంపై అశ్వారావుపేట వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో దమ్మపేట మండలం గణేశ్‌పాడు క్రాస్ రోడ్డు దగ్గరలో శ్రీనివాసరావు ద్విచక్ర వాహనానికి కుక్క అడ్డుగా వచ్చింది. దీంతో ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తగ్గుతూ.. పెరుగుతూ..

భద్రాచలం వద్ద గోదారి దోబూచులాట

రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేసిన కలెక్టర్

భద్రాద్రి కొత్తగూడెం, జూలై 25 (నమస్తే తెలంగాణ) : భద్రాచలం వద్ద గోదావరి నీటి ప్రవాహం తగ్గుతూ.. పెరుగుతోంది. బుధవారం రాత్రి వరకు తగ్గిన వరద ప్రవాహం ఎగువన కురుస్తున్న వర్షాలతో గురువారం ఉదయం నుంచి మళ్లీ ఎక్కువవుతోంది. దీంతో అధికారులు రెండో ప్రమాద హెచ్చరికను మళ్లీ జారీ చేశారు. ఎగువన విస్తారంటూ కురుస్తున్న వర్షాల ప్రభావంతో ఏ సమయంలో ఎలా ఉంటుందో చెప్పలేమంటున్నారు అధికారులు. గురువారం ఉదయం నుంచి రెండో ప్రమాద హెచ్చరికను దాటి 48.5 అడుగుల వద్ద ప్రవహిస్తోంది. రాత్రి 7 గంటలకు 48.80 అడుగులకు నీటి ప్రవాహం చేరింది. దీంతో ముంపు ప్రాంత ప్రజలను కలెక్టర్ జితేశ్ వి పాటిల్ అప్రమత్తం చేశారు. ముంపు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని అధికారులను ఆదేశించారు. జిల్లా యంత్రాంగం సలహాలు, సూచనలు పాటించాలని చెప్పారు. ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావొద్దని, అత్యవసర సేవలకు కంట్రోల్ రూమ్ నంబర్లకు కాల్ చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఆయా మండలాల్లో నోడల్ అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు.

వాణిజ్య

రియల్ పన్ను పోటు

స్థిరాస్తి క్రయవిక్రయాలకు దెబ్బ • బడ్జెట్‌లో ఇండెక్సేషన్ బెనిఫిట్ దూరం

పెరిగిన ఎల్‌టీసీజీ పన్ను భారం • నిర్మాణ రంగానికి నష్టమేనంటున్న నిపుణులు

మధ్యతరగతి సొంతింటి కలల్ని కేంద్ర ప్రభుత్వం తెచ్చిన బడ్జెట్ చెరిపేసింది. ఇండెక్సేషన్ ప్రయోజనాన్ని తొలగించి మోయలేనంత పన్ను భారాన్ని మోదీ సర్కారు మోపింది మరి. స్థిరాస్తి క్రయవిక్రయాలను ఆందోళనకరం చేస్తూ తీసుకున్న ఈ నిర్ణయంపట్ల నిర్మాణ రంగ పరిశ్రమ భగ్గుమంటున్నదిప్పుడు.

న్యూఢిల్లీ, జూలై 25: కరోనా ప్రభావం నుంచి నెమ్మదిగా బయటపడిన స్థిరాస్తి రంగం.. మళ్లీ మందగమనంలోకి వెళ్లనుందా? బడ్జెట్‌లో మోపిన పన్ను భారంతో క్రయవిక్రయాలు పడిపోనున్నాయా? ధరలు పెరిగి సామాన్యుల సొంతింటి కలలు చెదిరిపోతాయా?.. దేశీయ నిర్మాణ రంగాన్ని ఇప్పుడు కుదిపేస్తున్న ప్రశ్నలివే. అవును.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2024-25)గాను లోక్‌సభలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్.. రియల్ ఎస్టేట్ ఇండస్ట్రీని ఒక్కసారిగా షాక్‌కు గురిచేసింది మరి.

ఇదీ సంగతి..

పార్లమెంట్‌లో ఈ నెల 23న (మంగళవారం) ప్రకటించిన వార్షిక బడ్జెట్‌లో స్థిరాస్తులు, ఇతర ఆర్థిక, ఆర్థికేతర ఆస్తుల అమ్మకాలపై ఇండెక్సేషన్ బెనిఫిట్స్‌ను తొలగిస్తున్నట్టు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. దీంతో రియల్ ఎస్టేట్ రంగంపై ఇది తీవ్ర ప్రతికూల ప్రభావాన్ని చూపుతుందని ఇప్పుడు మెజారిటీ ఇండస్ట్రీ నిపుణులు విశ్లేషిస్తున్నారు. లాంగ్-టర్మ్ క్యాపిటల్ గెయిన్స్ (ఎల్‌టీసీజీ లేదా దీర్ఘకాల మూలధన లాభాలు) పన్నుకు ఇండెక్సేషన్ ప్రయోజనాన్ని తీసేస్తున్నట్టు విత్త మంత్రి వెల్లడించారు. అలాగే ఎల్‌టీసీజీ ట్యాక్స్‌ను 12.5 శాతానికి తగ్గిస్తున్నట్టూ చెప్పారు. ఇంతకుముందు ఇండెక్సేషన్ ప్రయోజనంతో 20 శాతంగా ఉండేది. అయితే గతంతో పోల్చితే పన్ను శాతం దాదాపు సగానికి తగ్గినా.. ఇండెక్సేషన్ బెనిఫిట్‌ను దూరం చేయడం వల్ల స్థిరాస్తి అమ్మకం దారులపై ట్యాక్స్ భారం ఇంకా పెరుగుతుండటమే ఇప్పుడు అందరి ఆందోళనకు కారణమవుతున్నది. ముఖ్యంగా రీ-సేల్ మార్కెట్ కుదేలవుతుందన్న అభిప్రాయాలున్నాయి.



ఇండెక్సేషన్ బెనిఫిట్ అంటే?

2001 తర్వాత కొన్న ఇండ్లను ఇప్పుడు అమ్మితే.. కొనుగోలు చేసిన ధరపై వచ్చిన లాభానికి ఇండెక్సేషన్ బెనిఫిట్ లేకుండా ఎల్‌టీసీజీ పన్ను 12.5 శాతం వర్తిస్తుందని బడ్జెట్‌లో మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పారు. అయితే అంతకుముందు (2001 మార్చి 31 లోపు) కొన్న ఇండ్లను అమ్ముకుంటే మాత్రం ఇండెక్సేషన్ ప్రయోజనం ఉంటుంది. ఇండెక్సేషన్ బెనిఫిట్‌ను కాస్ట్ ఇన్‌ఫ్లేషన్ ఇండెక్స్ (సీఐఐ) నంబర్ల ఆధారంగా లెక్కిస్తారు. 2001-02 నుంచి (2001 ఏప్రిల్ నుంచి) ప్రతీ ఆర్థిక సంవత్సరం ఈ సీఐఐ నంబర్‌ను ఆదాయ పన్ను (ఐటీ) శాఖ విడుదల చేస్తూ వస్తున్నది. 2001-02లో నాటి ద్రవ్యోల్బణం ఆధారంగా ఇది 100గా ఉన్నది. ఈ బేస్ రేటు (100)నే 2001 కంటే ముందు ఇండ్లు కొన్నవారికి ఇండెక్సేషన్ బెనిఫిట్ లెక్కింపునకు వాడుతున్నారు. ఇక ఈ ఆర్థిక సంవత్సరం (2024-25) ఇప్పటి ద్రవ్యోల్బణం రేటు ప్రకారం సీఐఐ 363గా నిర్ణయించారు. దీని ప్రకారం 2001-02 ఆర్థిక సంవత్సరంలో మీరు లక్ష రూపాయలకు ఇల్లు కొంటే.. ప్రస్తుతం దాని విలువ రూ.3.63 లక్షలు అన్నమాట. ఇంతకు మించిన ధరకు ఇల్లును మీరు అమ్ముకుంటే అందులో సదరు రూ.3.63 లక్షలుపోను మిగతా మొత్తానికే ఎల్‌టీసీజీ పన్ను చెల్లించాల్సి ఉంటుంది. దీన్నే ఇండెక్సేషన్ బెనిఫిట్ అంటారు. అయితే ఇది పాత పన్ను ప్రకారం. తాజా బడ్జెట్‌లో చేసిన మార్పుల ప్రకారం ఇంటిని అమ్ముకున్న ధరలో నుంచి కొన్న ధర లక్ష మాత్రమే తీసేస్తారు. మిగతా మొత్తం అంతటికీ పన్ను పడుతుంది.

పాత పన్ను ప్రకారం

2018-19లో రూ.50 లక్షలతో రాజేశ్ ఓ ఇంటిని కొనుగోలు చేశారు. ఆ ఆర్థిక సంవత్సరానికిగాను సీఐఐ 280గా ఉన్నది. 2024-25లో రాజేశ్ ఆ ఇంటిని రూ.70 లక్షలకు అమ్మేశారు. ఈ ఆర్థిక సంవత్సరంలో సీఐఐ 363గా ఉన్నది. దీంతో ఇంటిని అమ్మిన ఆర్థిక సంవత్సరం సీఐఐతో.. ఇంటిని కొన్న ఆర్థిక సంవత్సరం సీఐఐని భాగించడం జరుగుతుంది. 363/280=1.296428 వస్తుంది. దీన్ని ఇంటిని కొన్న ధర రూ.50 లక్షలతో గుణిస్తే.. రూ.64,82,142గా ఉంటుంది. ఇంటిని అమ్మడం ద్వారా వచ్చిన రూ.70 లక్షల్లో నుంచి ఈ రూ.64,82,142ను తీసేయాలి. అప్పుడు రూ.5,17,858 వస్తుంది. దీనిపై ఎల్‌టీసీజీ పన్ను 20 శాతం అంటే రూ.1,03,571.6 చెల్లిస్తే సరిపోతుంది.

కొత్త పన్ను ప్రకారం

అమ్మిన ధర రూ.70 లక్షల నుంచి కొన్న ధర రూ.50 లక్షలను తీసేస్తే.. మిగిలే ఆ రూ.20 లక్షలపై 12.5 శాతం ఎల్‌టీసీజీ పన్ను చెల్లించాలి. అంటే రూ.2.50 లక్షలు చెల్లించాలి. ఎల్‌టీసీజీకి ఇండెక్సేషన్ బెనిఫిట్‌ను తొలగించడం వల్ల గతంతో పోల్చితే ఇంటి అమ్మకంపై సుమారు రూ.1.47 లక్షలు అదనంగా ట్యాక్స్‌పేయర్లు చెల్లించాల్సి వస్తున్నదన్నమాట.

ఇండస్ట్రీ వర్గాల ఆందోళనలివీ..

- ఇండెక్సేషన్ బెనిఫిట్‌ను తాజా బడ్జెట్‌లో తీసేయడం వల్ల రీసేల్ మార్కెట్ లావాదేవీలు మందగిస్తాయి.
- ఎప్పుడో కొన్న ఇండ్లు, భూములను ఇప్పుడు అమ్మేందుకు వాటి యజమానులు పన్ను భారం కారణంగా ఆసక్తి చూపరు.
- కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో అమ్మకందారులకు పన్ను భారం పెరిగి లాభాలు తగ్గుతాయి.
- పన్నుల కారణంగా స్థిరాస్తి ధరలను అమ్మకందారులు అమాంతం పెంచేస్తారు. దీనివల్ల కొనుగోలుదారులు ముందుకురాని దుస్థితి నెలకొంటుంది.
- పన్నుల్ని తప్పించుకోవడానికి నగదు లావాదేవీలనే అంతా ఎంచుకుంటారు. ఇది ప్రభుత్వ ఖాజానాకు, నిర్మాణ రంగానికి కూడా నష్టం.
- కొత్త పెట్టుబడులు రాక నిర్మాణ ప్రాజెక్టులు ఎక్కడివక్కడే ఆగిపోయే ప్రమాదం.
- ఇండెక్సేషన్ ప్రయోజనాన్ని తొలగించడం వల్ల రియల్టీలోకి బ్లాక్‌మనీ రాక పెరుగుతుంది.

మరో 1,000 తగ్గిన బంగారం ధర

- 3 రోజుల్లో రూ.5,000 పతనం
- హైదరాబాద్‌లో రూ.70 వేల దిగువకు తులం రేటు

న్యూఢిల్లీ, జూలై 25: బంగారం ధరలు భారీగా దిగొస్తున్నాయి. గురువారం తులం రేటు మరో రూ.1,000కిపైగా పడిపోయింది. దీంతో 24 క్యారెట్ 10 గ్రాముల విలువ హైదరాబాద్‌లో రూ.70 వేల దిగువకు చేరి రూ.69,820గా నమోదైంది. బుధవారంతో చూస్తే రూ.1,040 తగ్గింది. ఇక 22 క్యారెట్ రూ.950 దిగి రూ.64,000గా ఉన్నది. ఢిల్లీలో మాత్రం రూ.70,650 వద్ద స్థిరపడింది. ఇక్కడ అంతకుముందు రెండు రోజుల్లో రూ.4,000 దిగజారగా.. మొత్తం ఈ మూడు రోజుల్లో రూ.5,000 పతనం కావడం గమనార్హం. అంతర్జాతీయ మార్కెట్లలో ధరల క్షీణత, నగల వర్తకులు అమ్మకాల ఒత్తిడికి లోనవడంబులియన్ మార్కెట్‌ను దిగువ ముఖం పట్టిస్తున్నాయి. మరోవైపు కిలో వెండి ధర కూడా ఢిల్లీలో రూ.3,500 తగ్గి రూ.84,000గా ఉన్నది. హైదరాబాద్‌లో రూ.84,500 పలుకుతున్నది. బడ్జెట్‌లో బంగ